క్లుప్తంగా

లక్ష్మీవేంకటేశ్వర ఆలయంలో ప్రభుత్వ విప్ పూజలు

చందుర్తి: కార్తీక పౌర్ణమి సందర్భంగా మండలంలోని మల్యాలలో గల శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీలు కుమార్, లింగారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రాజయ్య, నాయకులున్నారు.

రాజన్న ఆలయానికి బోర్డును నియమించాలి

వేములవాడఅర్బన్: తెలంగాణలో దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజన్న ఆలయానికి యాదగిరిగుట్ట దేవస్థానం తరహాలో బోర్డు నియమించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. పేదల దేవుడిగా పేర్కొందిన రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. బ్రేక్ దర్శనం పేరిట రూ.300 వసూలు చేస్తూ వ్యాపార కేంద్రంగా మార్చారని తెలిపారు. భక్తులు సౌకర్యాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని కోరారు.

నేటి నుంచి ఉచిత శస్త్రచికిత్సలు

చందుర్తి: కరీంనగర్ శివారులోని నగునూర్ ప్రతిమ ఆస్పత్రిలో శనివారం నుంచి 20వ తేదీ వరకు ఉచిత శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి ఇన్‌చార్జి కౌశిక్ ఒక ప్రకటనలో తెలిపారు. అపెండెక్స్, గజ్జ ఉబ్బరం, పొత్తి కడుపు ఉబ్బరం, శోషరస కణతులు, గాలి బ్లాడర్ రాళ్లు, కొవ్వుగడ్డలు, హైడ్రెసెల్, వేరికోస్, రొమ్ము గడ్డలు, థైరాయిడ్ వంటి వాటిని శస్త్ర చికిత్సల ద్వారా తొలగించనున్నామని అన్నారు. మందుల ఖర్చులు భరించుకోవాలని పేర్కొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

వీర్నపల్లి: బీజేపీ మండల అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలో పార్టీ క్రియాశీల సభ్యత్వ నమోదును ఇన్‌చార్జి కంచర్ల పర్శరాములు, అనుష్‌యాదవ్ ప్రారంభించారు. ప్రతీ బూత్‌లో ఇద్దరు సభ్యులు ఒక్కొక్కరు వంద క్రియాశీల సభ్యత్వం చేయాలని, ఈనెల 17లోపు పూర్తి చేయాలని అన్నారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి తిరుపతి, ఎస్టీ జిల్లా కార్యదర్శి రమేశ్, నాయకులు ప్రకాశ్, కేలోత్ గంగ్యా, రాజు, లకావతు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదులో పాల్గొన్న నాయకులు

సిరిసిల్ల: తంగళ్లపల్లి మండలం మండెపల్లిలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి డిసెంబర్ 20 నాటికి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సీపీఐ మండల కార్యదర్శి సోమ నాగరాజు, నాయకులు సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



మల్లయ్య

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్‌కు చెందిన ఈర్ల మల్లయ్య(62) కొన్నిరోజులుగా కనిపించకుండా పోయాడని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. 11రోజుల క్రితం పొలం పనులకు వెళ్లిన మల్లయ్య ఇంటికి తిరిగి రాలేదని భార్య, కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మల్లయ్య ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల ఇళ్లలో వాకబు చేసినా జాడ తెలియలేదన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కిక్కిరిసిన ఆలయాలు

వేములవాడరూరల్: కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఉదయాన్నే భక్తులు ఆలయం వద్దకు వెళ్లి ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. అనంతరం దీపదానాలు చేసి, జ్యోతులు వెలిగించారు.

సీపీఎం మహాసభలు విజయవంతం చేయండి

బోయినపల్లి: జిల్లా కేంద్రంలో 19న జరిగే సీపీఎం మూడో జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం మండల కన్వీనర్ గురజాల శ్రీధర్ కోరారు. సీపీఎం మహాసభల కరపత్రాలను స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ హమాలీ కార్మికుల ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. హమాలీ కార్మికులు చంద్రగిరి లచ్చయ్య, రాజయ్య, ఎడపల్లి శ్రీను, నాగరాజు, పొత్తూరి రాములు, నర్సయ్య, దాసరి ప్రభాకర్ ఉన్నారు.



ముస్తాబాద్‌లో దీపోత్సవం



జంగారెడ్డిపల్లిలో..

భక్తిశ్రద్ధలతో కార్తీక దీపోత్సవం

ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట/ఇల్లంతకుంట/బోయినపల్లి: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని జిల్లాలోని ఆలయాల్లో మహిళా భక్తులు తెల్లవారు జాము నుంచే దీపాలు వెలిగించారు. ముస్తాబాద్ శివకేశవుల ఆలయం, ఎల్లారెడ్డిపేట ఆంజనేయస్వామి, ఇల్లంతకుంట మండలం జంగారెడ్డిపల్లెలోని శ్రీరామలింగేశ్వర ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని గంగాధరక్షేత్రంలో సామూహిక సత్యనారాయణవ్రతాలు నిర్వహించారు.



ముస్తాబాద్‌లో దీపోత్సవంలో మహిళలు



బోయినపల్లి: కోరెం ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

వచన కవితా పోటీల్లో ప్రతిభ

గంభీరావుపేట(సిరిసిల్ల): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని కోడూరు శాంతమ్మ స్మారక బాలల సాంస్కృతికోత్సవం, తెలంగాణ సారస్వత పరిషత్ నిర్వహించిన వచన కవితా పోటీల్లో మండలంలోని లింగన్నపేట జెడ్పీ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి జోగేశ్వర్ ప్రతిభ కనబరిచాడు. శుక్రవారం హైదరాబాద్‌లో సాహితీ వేత్తలు శివారెడ్డి, వరప్రసాద్, కేవీ రమణాచారి చేతుల మీదుగా జోగేశ్వర్ బహుమతి అందుకున్నాడు.



బహుమతి అందుకున్న జోగేశ్వర్

ప్రొటోకాల్ ఆఫీస్‌లో ఇష్టారాజ్యం

- దర్శనానికి వచ్చిన వీఐపీలపై దురుసు ప్రవర్తన
- ఉద్యోగులతీరుపై అసహనం వ్యక్తం చేసిన భక్తులు

వేములవాడఅర్బన్: రాజన్న ఆలయంలోని ప్రొటోకాల్ ఆఫీస్‌లో ఉద్యోగుల తీరు ఇష్టారాజ్యంగా మారింది. రాజన్న దర్శనానికి వచ్చే వీఐపీలపై అక్కడి సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు వివాదాస్పదంగా మారుతుంది. కనీస మర్యాద ఇవ్వడం లేదనే ఆరోపణలు భక్తుల నుంచి వినిపిస్తున్నాయి. దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన రాజన్న ఆలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. స్వామి వారిని దర్శించుకునేందుకుఅధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు ప్రొటోకాల్ విభాగాన్ని ఆశ్రయించారు. అక్కడ విధులు నిర్వహించిన ఉద్యోగుల తీరుపై నొచ్చుకున్నారు. సాక్షాత్తు దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ సిఫారసు చేసిన లేటర్‌తో వచ్చిన ఓ అధికారికి అక్కడి ఉద్యోగుల తీరుతో అసహనం వ్యక్తం చేశారు. తాను గతంలో చాలాసార్లు వచ్చానని, ఇలాంటి అనుభవం ఎన్నడూ ఎదురుకాలేదన్నారు. కార్తీకపౌర్ణమి నాడు దర్శనానికి వస్తే ప్రొటోకాల్ ఆఫీస్ సిబ్బంది తీరు అసలు బాగాలేదన్నారు. ఇక కార్యాలయంలో విధులు నిర్వహించాల్సిన ఇతర ఉద్యోగులు లేకపోవడంతో ఇతర విభాగాల్లో పనిచేస్తున్న వారిని తాత్కాలికంగా పీఆర్‌వో కార్యాలయంలో సర్దుబాటు చేశారు. వారు భక్తులతో వ్యవహరించిన తీరు వివాదాస్పదంగా మారింది. ఇప్పటికే రాజన్న ఆలయ అధికారులకు, పీఆర్‌వో విభాగానికి సఖ్యత లేదనే చర్చలు సాగుతున్నాయి. ఈనేపథ్యంలోనే పీఆర్వో సిబ్బంది ప్రముఖ పర్వదినం రోజున గైర్హాజరవడం, ఇతర ఉద్యోగులను ఇక్కడ కేటాయించడం.. వారి వ్యవహారం సరిగ్గా లేకపోవడం చర్చకు దారితీసింది. ఈ విషయంపై రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డిని వివరణ కోసం సాక్షి ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు.



అధికారులు, భక్తులకు మధ్య వాగ్వాదం

మాజీ కౌన్సిలర్ దేవదాసు మృతి



దేవదాసు(ఫైల్)

సిరిసిల్లటౌన్: మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాపెల్లి దేవదాసు(65) గురువారం రాత్రి మృతి చెందారు. దేవదాసు కొన్ని రోజులుగా అనారోగ్యంతో రాజకీయంగా స్తబ్దుగా ఉన్నారు. తొలుత పద్మశాలీ యువజన సంఘం అధ్యక్షుడిగా, కౌన్సిలర్‌గా పనిచేశారు. గత పాలకవర్గంలో ఆయన భార్య రాపెల్లి లక్ష్మి కౌన్సిలర్‌గా సేవలు అందించారు. బీఆర్‌ఎస్‌లో చురుగ్గా పనిచేసిన ఆయన ఇటీవలే కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, కార్యదర్శి మ్యాన ప్రసాద్ తదితరులు ఆయన మృతికి నివాళి తెలిపారు.

మహాసభలు విజయవంతం చేయాలి



హమాలి కార్మికులతో మాట్లాడుతున్న సీసీఎం నాయకుడు ఎల్లారెడ్డి

వీర్నపల్లి: వీర్నపల్లి మండలం లాల్‌సింగ్‌తండా ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద సీపీఎం నాయకులు ఎల్లారెడ్డి హమాలి కార్మికులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఎల్లారెడ్డి మాట్లాడుతూ ఈనెల 19, 20 తేదీల్లో నిర్వహించే జిల్లా మూడో మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. గజన్, చందు, రాజు, ప్రకాశ్, గణేశ్, గణపతి, రాంరెడ్డి పాల్గొన్నారు.

బిర్సాముండా జయంతి



బహుమతులు అందజేస్తున్న ప్రతినిధులు

బోయినపల్లి: మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో మై భారత ఎన్‌వైకేఎస్ గంగిపల్లి స్వామికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం అడవి బిడ్డలకు ఆరాధ్య దైవం బిర్సా ముండా జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ రఘునాథ్, నాయకులు గుడి రవీందర్‌రెడ్డి, బోగోజి గంగాధర్‌చారి, గంగిపెల్లి రాజశేఖర్, ఈర రాజు తదితరులు ఉన్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన చక్రధర్‌రెడ్డి



పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌తో చక్రధర్‌రెడ్డి

ముస్తాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను హైదరాబాద్‌లోని తన నివాసంలో శుక్రవారం కలిసినట్లు కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికల కో–కన్వీనర్ కనమేని చక్రధర్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై చర్చించినట్లు పేర్కొన్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఆదేశాలతో చర్చించామన్నారు.

బోటులో వెళ్లి.. దత్తాత్రేయను దర్శించుకొని



బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి మండలం మిడ్‌మానేరు బ్యాక్‌వాటర్‌లోని వరదవెల్లి గుట్టపై స్వయంభూ దత్తాత్రేయస్వామిని కార్తీకపౌర్ణమి సందర్భంగా శుక్రవారం భారీ సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయానికి బోటు సౌకర్యం కల్పించిన తర్వాత తొలిసారి భక్తులు మానీటిలో ప్రయాణించి స్వామి వారి దర్శనం చేసుకున్నారు.

ప్రజా పోరాటాలకు సిద్ధం

సిరిసిల్లటౌన్: ప్రజా పోరాటాలకు సీపీఎం సిద్ధమని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు తప్పెట్ల స్కైలాబ్ బాబు అన్నారు. శుక్రవారం సిరిసిల్లలోని ఆర్‌ఎంపీ భవన్‌లో జరిగిన పట్టణ మహాసభలో జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన వాగ్దానాలను విస్మరించారన్నారు. కార్మికులు, కర్షకులు, నిరుపేద వర్గాల సంక్షేమానికి పార్టీ నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్, పట్టణ అధ్యక్షుడు శ్రీరాం సదానందం, సూరం పద్మ, సిరిమల్ల సత్యం, నక్క దేవదాసు, గుండు రమేశ్ తదితరులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ కార్యదర్శిగా అన్నల్‌దాస్ గణేష్ తదితరులు ఎన్నికయ్యారు.



వైభవంగా వెంకన్న జాతర

చందుర్తి: మండలంలోని రామన్నపేట శివారులోని అటవీప్రాంతంలో వెలసిన శ్రీవెంకటేశ్వరస్వామి జాతర శుక్రవారం కనుల పండువగా సాగింది. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చింతపంటి రామస్వామి, నాయకులు వెల్పుల దేవస్వామి, బొజ్జ మల్లేశం, పులి సత్తయ్య, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు, చందుర్తి సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి శ్రీలక్ష్మీనర్సింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం గరుడసేవ నిర్వహించారు. జాతర మహోత్సవానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు.



రుద్రంగిలో పూజలు చేస్తున్న విప్ శ్రీనివాస్



రామన్నపేటలో హాజరైన ఏనుగు మనోహర్‌రెడ్డి



రామన్నపేటలో విప్ ఆది శ్రీనివాస్



స్వామి వారి పల్లకి సేవ



పూజలు చేస్తున్న అర్చకులు

వైభవంగా వేణుగోపాలుడి రథోత్సవం



లడ్డూతో బొమ్మకంటి అభిమన్యు–సుదీప్త దంపతులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలోని శ్రీవేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం పెద్ద రథోత్సవం వైభవంగా నిర్వహించారు. రాత్రి 9 గంటలకు పెద్ద రథంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేలంలో స్వామి వారి లడ్డూను స్థానిక వ్యాపారవేత్త బొమ్మకంటి భాస్కర్ కుమారుడు–కోడలు అభిమన్యు–సుదీప్త దంపతులు రూ.50,216లకు దక్కించుకున్నారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, మాజీ సర్పంచ్ నేవూరి వెంకటరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు పందిర్ల నాగరాణి ,ఎలగందుల అనసూయ, ఆలయ కమిటీ చైర్మన్ గడ్డం జితేందర్, వైస్ చైర్మన్ గంట వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు సమావేశం

సిరిసిల్ల: భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు యాచమనేని శ్రీధర్‌రావు అధ్యక్షతన శుక్రవారం తంగళ్లపల్లిలో పార్టీ సభ్యత్వ నమోదు బూత్ స్థాయి సమావేశం నిర్వహించారు. పార్టీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి గూడూరి భాస్కర్, బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు సంటి మహేశ్ మాట్లాడుతూ తంగళ్లపల్లిలో 50 బూత్‌లు ఉన్నాయని ప్రతీ బూత్‌లో ఇద్దరు సభ్యులు ఒక్కొక్కరూ 100 క్రియాశీల సభ్యత్వాలు నమోదు చేయించాలని కోరారు. ఈనెల 17తో సభ్యత్వ నమోదు గడువు ముగుస్తుందని, ఈనెల 25న బూత్ అధ్యక్షుల ఎన్నిక ఉంటుందని తెలిపారు. ఇటుకల మహేందర్, జంగం కిషన్, బలగం భాస్కర్, ఆశీర్వాదం, అభిలాష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



తంగళ్లపల్లిలో బీజేపీ బూత్‌స్థాయి సమావేశం

ఉద్యోగుల ఖాళీలతో ఇబ్బందులు

- మంత్రి పొన్నం ప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్‌కు వినతికి సిద్ధం

వేములవాడఅర్బన్: రాజన్న ఆలయానికి వచ్చిన ఇతర దేవాలయ ఉద్యోగులు డిప్యూటేషన్‌పై తిరిగి వెళ్లడాన్ని ఉద్యోగ సంఘం నాయకులు రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. సాక్షిలో శుక్రవారం 'ఇవేం బది'లీలలు'' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించారు. ఆలయ ఉద్యోగుల సంఘం మంత్రికి, ప్రభుత్వ విప్‌కు వినతిపత్రం అందించనున్నట్లు సమాచారం. రాజన్న ఆలయం నుంచి ఇప్పటికే ఇద్దరు పర్యవేక్షకులు, ఇటీవల సహాయ కార్యనిర్వహణాధికారి డిప్యూటేషన్‌పై యాదగిరిగుట్టకు బదిలీ చేయడంతో ఇక్కడ ఉన్న అధికారులకు తీవ్ర పనిభారం పెరిగిందని చర్చ సాగుతోంది. ఆలయంలో క్యాడర్ స్టంత్ ప్రకారం 14 మంది పర్యవేక్షకులు ఉండగా ప్రస్తుతం 8 మందితోనే విధులు నిర్వహిస్తున్నారు. అలాగే పదోన్నతులు పొందిన వారితోపాటు అనారోగ్య సమస్యలు ఉన్నవారు మాతృసంస్థకు పంపాలని చేసుకున్న అర్జీలను పరిగణనలోకి తీసుకుని, ఖాళీలను భర్తీ చేస్తే తమకు ఇబ్బంది తప్పుతుందని వారు వినతిపత్రంలో పేర్కొంటున్నట్లు తెలిసింది. బదిలీ అయిన స్థానంతోపాటు పదోన్నతులు పొందిన వారిని తిరిగి మాతృసంస్థకు పంపాలని రాజన్న ఆలయ ఉద్యోగుల సంఘం తరఫున మంత్రికి, ప్రభుత్వ విప్‌కు వినతిపత్రం అందించడానికి సిద్ధమైనట్లు తెలిసింది.

మాజీ సర్పంచుల బిల్లులు ఇప్పించండి

- మంత్రి పొన్నంకు వినతిపత్రం అందజేత

సిరిసిల్లటౌన్: తమ హయాంలో గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు ఇప్పించాలని కోరుతూ మాజీ సర్పంచులు శుక్రవారం సిరిసిల్లకు వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు విన్నవించారు. మాజీ సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి కరుణాకర్, గౌరవ సలహాదారు బొజ్జం మల్లేశం, జిల్లా కార్యదర్శి గున్నాల లక్ష్మణ్, పిట్ల సతీశ్, ముక్క శంకర్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు వినతిపత్ర ఇస్తున్న మాజీ సర్పంచులు

సర్వే పరిశీలన

రుద్రంగి: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేను శుక్రవారం రుద్రంగి మండల కేంద్రంలో తహసీల్దార్ శ్రీలత పరిశీలించారు. సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్‌కు పలు సూచనలు చేశారు. ఆర్‌ఐ నవీన్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

వృద్ధురాలిపై కుక్క దాడి

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ఓ వృద్ధురాలు జాతర చూసేందుకు శుక్రవారం సాయంత్రం జాతర ప్రాంతానికి రాగా పిచ్చికుక్క దాడి చేసింది. వెంటనే కుటుంబ సభ్యులు ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. జాతర గ్రౌండ్‌లో పిచ్చికుక్కలు తిరుగుతున్నా పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బట్టలు పంపిణీ

ఇల్లంతకుంట: కార్తీక పౌర్ణమి పండుగ పురస్కరించుకొని పారిశుధ్య కార్మికులకు గ్రామ మాజీ సర్పంచ్ కూన బోయిన భాగ్యలక్ష్మి బాలరాజు శుక్రవారం నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు బాలయ్య, పోచయ్య , తారవ్వ , లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

23న మాలల బహిరంగ సభ

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలో ఈనెల 24న నిర్వహించాల్సిన మాల, ఉపకులాల బహిరంగసభను 23న నిర్వహిస్తున్నట్లు సభ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు రాగుల రాములు తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. దోశల చంద్రం, వంకాయల భూమయ్య, లింబాద్రి, సురేష్, రాజమల్లు, రమేశ్ పాల్గొన్నారు.

వేములవాడ సమాచారం



వేములవాడ రాజన్న సన్నిధిలో బుధవారం సాయంత్రం 4 గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	05	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	07	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	07	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	05	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	07	1,008
నందీశ్వర నాన్‌ఏసీ	06	560
నందీశ్వర సూట్స్	07	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	05	448
పార్వతీపురం స్పెషల్	06	672
పార్వతీపురం సాధారణ	12	336

– వేములవాడ